# జీపీ భవన నిర్మాణానికి పర్మిషన్ ఇవ్వాలి

ఎదులాపురం, అక్టోబర్ 21: అటవీ శాఖ పరిధిలో ఉన్న బేల మండలం గణేశ్‌పూర్ గ్రామంలో పంచాయతీ భవనం కట్టుకోవడానికి పర్మిషన్ ఇవ్వాలని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్ రెడ్డి సోమవారం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా అటవీ శాఖ అధికారులు అనుమతి ఇవ్వకపోవడంతో గ్రామానికి ఏళ్లుగా పంచాయతీ భవనం లేదన్నారు. దీనివల్ల గ్రామంలోని ప్రజలకు అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కూర్చోవాల్సి రావడంతో అటు విద్యార్థులకు ఇటు గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అందుకు గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి అటవీ శాఖ అధికారులు అనుమతి ఇచ్చేవిధంగా చూడాలని కలెక్టర్‌ను కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి పర్మిషన్ ఇప్పించేటట్లు చూస్తామని హామీ ఇచ్చారు. కలిసిన వారిలో మాజీ సర్పంచ్ బాపురావ్, టేకం భీంరావ్, వికాస్, జంగు , తదితరులు ఉన్నారు.

# సర్వే 68లో దారి సమస్యను పరిష్కరించాలి

**ప్రజావాణిలో కలెక్టర్‌కు యజమానుల వినతి**

ఎదులాపురం, అక్టోబరు 21 : ఆదిలాబాద్ సమీపంలోని అంకోలి, తంతోలి రోడ్డుకు దగ్గరగా ఉన్న సర్వే నంబర్ 68 లే ఔట్‌లోని ప్లాట్లకు దారి సమస్యను పరిష్కరించాలని ప్లాట్ల యజమానులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రాజర్షి షాకు దరఖాస్తు అందజేశారు. సర్వే నంబర్ 68/6 లే ఔట్ యజమాని తమ లే ఔట్ రోడ్డుకు సరిగా లింక్ చేయకుండా గోడను నిర్మించారని తెలిపారు. దీంతో తమకు ప్రధాన రహదారికి వెళ్లడానికి రోడ్డు లేకుండా పోయిందన్నారు. ఈ సమస్యను పరిష్కారం కోసం తగిన చర్య తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. దరఖాస్తు ఇచ్చిన వారిలో యజమానులు దత్తాత్రి, సంతోష్, ప్రవీణ్‌కుమార్, సునీల్‌కుమార్ ఉన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ప్లాట్ల యజమానులు

# అట్రాసిటీ కేసులో మరొకరి అరెస్ట్

ఎదులాపురం, అక్టోబర్ 21: ఆదిలాబాద్ రూరల్ మండలం రామాయి వద్ద ఈ నెల 13వ తేదీన జరిగిన దాడి కేసులో ఎనిమిది మందితో పాటు మరికొందరిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి విషయం తెలిసిందే. ఈ కేసులో రామాయి గ్రామానికి చెందిన జిట్టా ప్రభాకర్, జట్టి రత్నాకర్, అనిల్, ఈశ్వర్, జ్ఞానేశ్వర్, ఇస్తారి, దత్తు, శ్యాం బోయితోపాటు మరికొందరిపై అట్రాసిటీ కేసు ఉన్న వారు పరారీలో ఉన్నారు. ఆదివారం శ్యాంబోయి అలీయాస్‌మన్ని శ్యాంసుందర్ అరెస్ట్ కాగా సోమవారం జిట్టె అనిల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. పరారీలో ఉన్న వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.


























